

# మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ప్రజానావ, ఆసిఫాబాద్ రూరల్:** కోతకు గురైన సి సి రోడ్డు మట్టి మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం మాణిక్ గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలోని కుమ్రంభీమ్ ప్రాజెక్టు కుడి కెనాల్ ప్రక్కన కోతకు గురైన సి సి రోడ్డు మట్టిని అధికారులత కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి సి రోడ్డు మట్టి కోతకు గురైనందున సంబంధిత శాఖల సమన్వయంతో సరి చేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి వార్షిక పరీక్షల కార్యాచరణ ఖరారు



**ప్రజానావ, మంచిర్యాల:** జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల కార్యాచరణ ఖరారైనట్లు జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ పేపర్లు 1, 2 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి ఒకేషనల్ కోర్స్ (థియరీ) పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడుతుందని, మిగతా అన్ని పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ




**ప్రజానావ, కౌటల:** మండల కేంద్రంలో సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను బుధవారం పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి పెంధోర్ ప్రేమలత తెలిపారు. ఈ సందర్భంగా 7 పెట్రోల్ పంపులు, 2 రోటోవేటర్లను లబ్ధిదారులకు అందజేశారు. రైతులకు అవసరమైన రోటోవేటర్, కల్టివేటర్, ఫ్లౌ, పవర్ వీడర్, పవర్ టిల్లర్, బేలర్ (వరి గడ్డి కట్టలు కట్టే యంత్రం), పెట్రోల్ పంపు, బ్యాటరీ పంపు తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన పరికరాల్లో రోటోవేటర్లు 12, పెట్రోల్ పంపులు 31, బ్యాటరీ పంపులు 78, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ 2, కల్టివేటర్ అండ్ ఫ్లౌ 13, పవర్ వీడర్ 1, పవర్ టిల్లర్ 2, బ్రష్ కట్టర్ 3 ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ, సాధారణ రైతులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు వ్యవసాయ అధికారి కార్యాలయం, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అంజన్న, ఘన్‌శ్యామ్, రేష్మిత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పోలీసులతో దురుసు ప్రవర్తన

- ముగ్గురికి రిమాండ్

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణ పరిధిలో బ్లూ కోర్ట్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో దురుసుగా ప్రవర్తించి, వారి విధులను ఆటంకపరిచిన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ఘటనలో పవన్ కల్యాణ్, రాహుల్, సుమన్ అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విధుల్లో ఉన్న పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించడం, అధికారుల పనికి ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై గుమిగూడటం, బైక్‌లపై తిరగడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చట్టం మరియు శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని టౌన్ ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# సృజనాత్మకతను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్

**ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి ప్రశాంత్**



**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంలో ప్రతి సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు వార్షిక పరీక్షల కంటే ముందు విద్యార్థుల లోపల దాగి ఉన్న భయాన్ని పోగొట్టి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఈ టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నిరంతరం విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థుల కోసం వారి సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతి సంవత్సరం ఇలాంటి టాలెంట్ టెస్ట్ లు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు దాదాపు 1000 మంది విద్యార్థులు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ లో రాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ శ్రీరాముల సంజన, జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు శివ, నాయకులు మహేష్, నవీన్, రాకేష్, సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా రుణ లక్ష్యాలను సాధించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ప్రజానావ, ఆసిఫాబాద్ :** బ్యాంకర్లు జిల్లాకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2025- 26 సంవత్సర 3వ త్రైమాసిక సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలలో ఇవ్వవలసిన రుణాల లక్ష్యాలను పెంపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేసి లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి ముద్ర రుణాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి కేటాయించిన రుణాలు, ప్రధానమంత్రి స్వయం ఉపాధి పథకం, ప్రధానమంత్రి విశ్వకర్మ వంటి ప్రభుత్వ పథకాలు, జన సురక్ష పథకాల లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి 3 వేల 23 కోట్ల రుణ లక్ష్యాలకు గాను ఇప్పటి వరకు జిల్లాలో 49 శాతంతో 1 వేయి 581 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని, లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి కొరకు మంజూరైన నిధులను బ్యాంకులు దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు వారు రూపొందించిన పొటెన్షియల్ లింక్డ క్రెడిట్ ప్లాన్ పథకాన్ని అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డి డి ఎం వీరభద్రుడు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్.డి.ఓ. రాములు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రితేష్ గుప్తా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా పరిశ్రమల శాఖ జి. ఎం., జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ. డి., బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**నూతన ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరికరాల అందజేత**



**ప్రజానావ, సత్తుపల్లి:** ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం సత్తుపల్లి నూతన ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్‌తో కలిసి సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సమగ్ర వైద్యం అందేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఆధునిక పరికరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ, ప్రభుత్వ అధికారులు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఐనపనూరు కుమారి, ఫయాజ్, మొరిశెట్టి సాంబశివరావు, డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, హాస్పిటల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ బాలికల సామాజిక సంక్షేమ నివాస జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి తనిఖీ చేశారు. మొదటి రోజు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9,396 మంది విద్యార్థులకు గాను 8,839 మంది హాజరై, 557 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, వెలుతురు, సరైన బెంచీలు వంటి కనీస వసతులు కల్పించాలన్నారు. అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను కూడా తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా గదుల్లోకి అనుమతించాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, నిరంతర రికార్డింగ్ కొనసాగాలన్నారు. సమయపాలన విషయంలో విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు కొనసాగించాలని ఎస్పీకి సూచించారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్, శిక్షణ ఐపీఎస్ రాహుల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో అన్నప్రాసనం



**ప్రజానావ, తాండూర్:** మండలంలోని రేచినిఉ3 అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేచిని గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యుడు మొగిలి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి వార్డు సభ్యుడు మొగిలి లక్ష్మణ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కుడుమేత వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ సునీత, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.




# నిందితులను శిక్షించాలి

**ప్రజానావ, గంభీరావుపేట:** పసిపాప మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పసిపాప మృతికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాండూర్ మండల పరిధిలో జరిగిన దారుణ ఘటనపై సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లిన రజక (చాకలి) కుటుంబానికి చెందిన చంద్రకళ కుటుంబంపై దాడి జరగడంతో రెండు నెలల పసిపాప మృతి చెందిన ఘటనను ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి చిన్నారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం మండల అధ్యక్షులు గుండారం మహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో జరిగిన ఈ ఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. ఆధిపత్య కుల అహంకారంతో దళిత మహిళను దూషించి, ఆమెతో పాటు ఆమె భర్తను బంధించి దాడి చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. మల్లన్న దర్శనం కోసం వచ్చిన కుటుంబం వద్ద డబ్బులు లేవని చెప్పినా కుల దురహంకారంతో వ్యవహరించడం అమానుషమన్నారు. ఒక తల్లి కళ్లముందే రెండు నెలల పసికందు మృతి చెందడం మానవత్వానికే మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు ఆరు రోజులు గడిచినా నిందితులు ఉద్యాల శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులను అరెస్టు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతుందన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కుల వివక్ష నిర్మూలనకు సమాజం ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రజక ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బకుటం తిరుపతి, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు, ఆదర్శ ఆటో యూనియన్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజానావ, తాండూర్:** క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి అన్నారు. విష్ణువర్ధన్ పటేల్ జ్ఞాపకార్థం చౌటపల్లి క్రీడా ప్రాంగణంలో గత వారం రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విష్ణువర్ధన్ పటేల్ సీనియర్ క్రికెట్ క్రీడాకారుడిగా అందరికీ సుపరిచితుడని, క్రీడలను ప్రోత్సహించడంలో ముందుండేవారని పేర్కొన్నారు. అనారోగ్య కారణంగా ఆయన మరణించడం బాధాకరమని, ఆయన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయన స్మృతిని నిలుపుకుంటున్నామని తెలిపారు. వారం రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విజేత జట్టుకు రూ. 10వేలు, రన్నర్ జట్టుకు రూ. 8వేల నగదు బహుమతులను అందజేశారు. ప్రతి క్రీడాకారుడు మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారని, భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీలను మండల స్థాయిలో నిర్వహించేందుకు సహకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు, బోయపల్లి ఉప సర్పంచ్ నల్లుల మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసాడి తిరుపతి, నిర్వాహకులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పేద వధువుకు చేయూత

**ప్రజానావ, జైనూర్ :** జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామ ఉప సర్పంచ్ పేందుర్ లచ్చు తన ఉదారతను చాటుకున్నారు. గ్రామానికి చెందిన కుంరా పారు బాయి అనే నిరుపేద యువతి వివాహానికి తనవంతు సహాయంగా రూ.5000 ఆర్థిక సాయాన్ని గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. గ్రామంలోని ప్రతి నిరుపేద పెళ్లికూతురికి తనవంతుగా సాయం అందిస్తానని ప్రకటించారు. అంతేకాకుండా, ప్రజలు పెళ్లికి వెళ్లే వచ్చేందుకు తన వాహనాన్ని ఉచితంగా ఇస్తానని చెప్పారు. ఉప సర్పంచ్ అందిస్తున్న తోడ్పాటుకు కుంరా పరివార్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పూసమ్ హన్మంత్ రావు , కరొబారి పూసమ్ జగన్నాథ్ రావు, దేవరి, పూసమ్, లింగు, కుంరా భోజ్జు, పటేల్, గ్రామ పెద్దలు, పూసమ్ సందుర్శావ్, ఉర్వేత, దంబి, ఆత్రం జగన్నాథ్ రావు, పూసమ్ అశోక్, ఆత్రం రాము, పూసమ్, పావు, కేశవ్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజానావ, మంచిర్యాల:** జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, వేంపల్లి ప్రాంతంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మార్చి 16వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ 5,372 మంది, ఒకేషనల్ 888 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5,227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేయాలని ఆదేశించారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ ద్వారా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల సురక్షిత రవాణా కోసం తపాలా శాఖ చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, హాజీపూర్ మండల తహశీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాంప్ ద్వారా మహిళలకు వ్యాపార ప్రోత్సాహం

### అదనపు కలెక్టర్ చంద్రయ్య





**ప్రజానావ, మంచిర్యాల:** రాంప్ మహిళా త్వరణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎంఎస్ఎంఈలకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణ మద్దతు అందించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్యలతో కలిసి ఐటీఈ-సి విభాగం, వీహబ్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా వ్యవస్థాపకుల కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు, భారత ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ మద్దతుతో అమలవుతున్న రాంప్ కార్యక్రమం ద్వారా మహిళల నేతృత్వంలోని సంస్థలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగే ఈ కార్యక్రమం ఎంపికైన మహిళా వ్యవస్థాపకులకు వ్యాపార వృద్ధిని వేగవంతం చేయడంతో పాటు ఆదాయం పెంపొందించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని చెప్పారు. వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, తయారీ, హస్తకళలు తదితర అభివృద్ధి చెందుతున్న రంగాలలో వ్యాపార నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి అభివృద్ధి, వైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్ వంటి అంశాల్లో నిపుణుల మార్గదర్శకత్వంలో మద్దతు అందిస్తామని వివరించారు. కార్యక్రమం అనంతరం ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నాన్‌ఫామ్ సారయ్య, వీహబ్ సంచాలకులు జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఉషా, డాక్టర్ సల్మాన్, ఆబిద్, శ్రీకర్, ఈడీసీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దర్గా కూల్చివేతపై టీఎస్ఎంహెచ్‌పీఎస్ గర్జన



**ప్రజానావ, వేములవాడ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడలో హజ్రత్ తాజుద్దీన్ ఖాజా బాగ్ సవార్ దర్గా కూల్చివేత ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. చారిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన ఈ దర్గా అకస్మాత్తుగా కూల్చివేయడంతో మైనార్టీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికులు, మత పెద్దలు, హక్కుల సంఘాలు ఈ ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి ఘాటుగా స్పందించింది. సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ ఆదేశాల మేరకు జిల్లా కన్వీనర్ మొహమ్మద్ హమీద్ బుధవారం కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నాయకులను లోపలికి అనుమతించకుండా అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా మొహమ్మద్ హమీద్ మాట్లాడుతూ గెజిటెడ్ వక్ఫ్ ఆస్తిగా ఉన్న దర్గాను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. నిజానిజాలు తెలుసుకోవడానికి వచ్చిన తమను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల హననమన్నారు. దర్గా వక్ఫ్ ఆస్తిగా ప్రభుత్వ గెజిట్‌లో నమోదై ఉందని, గతంలో వక్ఫ్ బోర్డు కూడా దీనిపై స్పష్టమైన అభిప్రాయం తెలిపిందని గుర్తుచేశారు. చట్టబద్ధ హోదా ఉన్న నిర్మాణాన్ని అధికారుల అండతో కూల్చివేయడం వెనుక కుట్ర ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని టీఎస్ఎంహెచ్‌పీఎస్ తరపున డిమాండ్ చేశారు. మైనార్టీ ఆస్తుల రక్షణ విషయంలో ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. దర్గా కూల్చివేత కారణంగా ప్రాంతంలో మత సామరస్యానికి భంగం కలిగే ప్రమాదం ఉందని, వెంటనే శాంతి చర్చలు నిర్వహించి అన్ని వర్గాల అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరారు.

# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**ప్రజానావ, ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండలంలోని ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్ గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ ప్రారంభించారు. తహశీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య సమక్షంలో లబ్ధిదారులు ఆనందోత్సాహాల మధ్య తమ కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నర్సింలు, ఉప సర్పంచ్ బందరపు బాల్‌రెడ్డి, బొప్పాపూర్ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మటి నర్సయ్య, హరిదాస్ నగర్ సర్పంచ్ చిర్రామ్ నాగరాజు, రాజన్నపేట సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, టౌన్ అధ్యక్షులు చిన్ని బాబు, ఏఎంసీ డైరెక్టర్లు మెండే శ్రీనివాస్, కిష్టారెడ్డి, వార్డ్ మెంబర్లు, సీనియర్ నాయకులు వంగ గిరిధర్ రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, గుర్రపు రాములు, బుచ్చ గౌడ్, కొండాపురం శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.







